## ఫెంగ్ షుయి



# వంటగది శుభ్రంగా ఉంటే..!

వంటగది శుభ్రంగా ఉంటే ఆ కుటుంబానికి అన్నీ అనుకున్నవిధంగా జరుగుతాయి. వంటగదికీ, మిగతా పనులకు సంబంధం ఏమిటి? అనుకుంటారేమో. సంబంధం ఉంది! ఇల్లాలు నిద్రలేచి కాఫీ కలపడంతో ఇంట్లో పనులు మొదలవుతాయి. అంటే, మొదటి పని వంట ఇంటితోనే ప్రారంభమవుతుంది. ఎక్కడి వస్తువులు అక్కడ పడేసి, శుభ్రంగా లేదంటే వంటింటిలోకి రాగానే చిరాకు మొదలవుతుంది. ఈ ప్రభావం మీ దైనందిన కార్యక్రమాలపై పడుతుంది. అందువలన రాత్రి పడుకోబోయే ముందు వంటగదిని శుభ్రం చేసుకోవాలి. ఎక్కడి వస్తువులను అక్కడ సర్ది పెట్టుకోవాలి.

ఇటీవల దాదాపు అందరి ఇళ్లలో వంటకోసం గ్యాస్ స్టవ్ వాడుతున్నారు. స్టవ్‌లను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి. కొందరి ఇళ్లలో స్టవ్‌లు తుప్పు పట్టిపోయింటాయి. నూనె మరకలుంటాయి. మరకలున్న స్టవ్‌లను చూడగానే ఎవరికైనా చిరాకనిపిస్తుంది. దీనికి తోడు ఇలాంటి స్టవ్‌లు సరిగా పని చేయవు. మంట తక్కువగా రావడంతో వంట చేయడం చాలా ఆలస్యమవుతుంది. ఒక వైపు భర్తకు క్యారేజీ, పిల్లలకు పొద్దున్నే టిఫిను చేయాల్సి ఉంటుంది. స్టవ్ బర్నర్‌లు శుభ్రంగా లేకపోవడంతో మంట బాగా రాదు. వంట ఆలస్యమవుతుంది. మరో వైపు పెద్దవాళ్లకు ఆఫీసులకు, పిల్లలకు విద్యాలయాలకు సమయం మించిపోతుంటుంది. అలాంటి సమయంలో ఆ ఇంట్లో గృహిణి మానసిక స్థితి ఎలా ఉంటుందో ఊహించండి!? చాలా చిరాకు పడుతూ ఉంటుంది. ఆ ప్రభావం ఇక రోజంతా ఉంటుంది. గృహిణికి కుటుంబ సభ్యులపైన విసుగు ఎక్కువవుతూ ఉంటుంది. ఈ కారణంగా మనస్పర్థలు తలెత్తే అవకాశం ఉంది. వంటగదిని, స్టవ్‌లను శుభ్రంగా ఉంచుకుంటే, నిద్ర లేచింది మొదలు అన్ని పనులూ చకచకా జరిగిపోతాయి. అదే ఉత్సాహంతో బయటి పనులను కూడా చకచకా చక్కబెట్టుకుని వస్తారు.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

## 'సరసి'కత

వైశంపాయనుడి ముందు పోలీస్ పెట్రోలింగ్ జీపు ఆగింది. చీకట్లో చిన్నగా అడుగులు వేసుకుంటూ అనుమానాస్పదంగా సంచితో సంచరిస్తున్న అతగాడిని ప్రశ్నించారు పోలీసులు.

"ఎవరు నువ్వు? దాన్లో ఏవుంది?" అంటూ అతడి చేతిలోని సంచీని లాక్కుని చూశారు. దాన్లో ధళధళలాడిపోతూ ఓ పెద్ద వెండి కంచం!!

వైశంపాయనుడికి చిన్నప్పట్నించీ పోలీసుల పేరు చెబితేనే భయమూ వణుకూను. ఇక ఎదురుపడి ప్రశ్నిస్తే వేరేచెప్పాలా! "నన్ను వైశంపాయడంటారండి. వెండి కంచం వూరెడితే మా బావ ఇంట్లో దాద్దామని..." కంగారు పడుతూ తక్కిరిబిక్కిరి సమాధానం చెప్పాడు. పోలీసులకేమీ అర్థంకాలేదు. మెడపట్టి జీపులోకి తోసి, ఠాణాకి తీసుకు పోయారు. అక్కడ ఇన్‌స్పెక్టరు నిద్రమత్తులో లేచి, లాగిపెట్టి ఓ 'హస్తం మార్కు బిస్కెట్' ఇచ్చేడు. వైశంపాయ



# వైశంపాయనుడూ వెండి కంచమూ

నుడు ఓ వెర్రి కేక పెట్టి, కూలబడిపోయాడు.

అరగంట పోయేసరికి సుబ్బాయమ్మ గారు ఆటోలో దిగింది.

పక్క వీధిలోని వెంకటేశ్వర్రావు బావగారు స్టేట్సు వెడుతూ నాలుగు నెలల పాటు తిరిగి రామని, విలువైన సామాన్లన్నీ అంతకుముందు రోజే లాకర్లో పెట్టేశామనీ, వెండి కంచం ఒక్కటీ అందులో పట్టలేదనీ, తాము తిరిగి వచ్చే వరకూ కాస్త మీ ఇంట్లో దాచండి అని వైశంపాయనుణ్ణి రిక్వెస్టు చేశార్ట. సదరు వెంకటేశ్వరరావు గారు కుటుంబ సమేతంగా – ఏర్‌పోర్టుకు బయల్దేరుతూ తెల్లారగట్ల మూడింటికి ఇంటికి తాళంవేసే ముందు వైశంపాయనుడిని పిలిచి, ఆ వెండి కంచం సంచినీ అతడికిచ్చి, క్యాబ్‌లో వెళ్లి పోయారట. వాళ్లు అలా వెళ్లారు, పోలీసులిలా వచ్చారు. వస్తూనే వైశంపాయనుణ్ణి పట్టేశారు!

జరిగిందంతా అవగతం అయ్యేక పోలీసులు నాలిక్కరుచుకున్నారు. "విషయం నసక్కండా చెప్పొచ్చు కదమ్మా! అయినా, చీకట్లో పట్టుకెళ్లకపోతే, ఆ కంచం ఏదో నిన్న పగటి పూటే తీసుకెళ్లి దాచుకోవచ్చుగా, మా టైమంతా వేస్టు చెయ్యకపోతే" అంటూ చిరాకు పడుతూ వెండి కంచం సంచి సమేతంగా వైశంపాయనుడిని, సుబ్బాయమ్మ గారినీ జీపిచ్చి ఇంటికి పంపించేరు.

*